





RNI NO: APTEL/2014/5832

# నవతరం

తెలుగు దిన పత్రిక

ఎడిషన్ ఇంచార్జ్: నవచైతన్య శిరిగిరి

సంపుటి: 13, సంచిక: 257, 19-09-2026 శనివారం వెల:1/- పేజీలు: 4

శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం - రాజమండ్రి


# మున్సిపల్ సేవల ప్రైవేటీకరణ ఆపాలి

***కార్మికులు, పట్టణ ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు వద్దు***

***స్ట్రీట్ లైటింగ్ టెండర్ల ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలి***

***మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి***

***పౌరసేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా***

***సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి. తేజేశ్వరరావు, ఎన్. బలరాం, అరుగుల గణేష్***

*నవతరం – శ్రీకాకుళం*

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, పట్టణ ప్రజలకు నష్టదాయకంగా మారే మున్సిపల్ సేవల ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి. తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. బలరాం, నగర అధ్యక్షులు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. స్ట్రీట్ లైటింగ్ టెండర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వాటర్ సప్లై, వీధి దీపాలు, పార్కులు, రోడ్లు, వాహనాలు తదితర 14 కీలక పౌరసేవలను ప్రభుత్వం--ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. అలాగే పట్టణ ప్రజలపై యూజర్ చార్జీల భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కీలకమని, అందుకు పౌష్టికాహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా అవసరమని తెలిపారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దుమ్ము, ధూళిలో పనిచేస్తూ అనారోగ్యానికి గురవుతున్న మున్సిపల్ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని నాయకులు విమర్శించారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల మున్సిపల్ కార్మికులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని అన్నారు. ముఖ్యంగా వీధి దీపాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ప్రస్తుతం స్ట్రీట్ లైటింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగ భద్రత ఏమవుతుందని ప్రశ్నించారు. ప్రైవేట్ సంస్థలకు లాభాలకు భరోసా కల్పిస్తూ, కార్మికులకు మాత్రం భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలు వసూలు చేస్తున్న పన్నుల్లో తగిన వాటాను స్థానిక సంస్థలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధుల కొరత కారణంగానే మున్సిపాలిటీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నీటిపన్ను, ఇంటిపన్ను, గ్రంథాలయ పన్ను, వాహన




పన్ను, రోడ్డు పన్నుల రూపంలో పట్టణ ప్రజల నుంచి వసూలవుతున్న కోట్లాది రూపాయల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. స్ట్రీట్ లైటింగ్ టెండర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు అమలు చేయాలని, కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అందించాలని, వారి హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు ఏ. జ్యోతిప్రసాద్, ఎం. రాఘవ, ధనాల చిట్టి, ఆర్. యుగంధర్, జె. మాధవి, ఎన్. పార్వతి, వి. సరోజ, డి. గంగ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా..

## పోలీసు జాగిలాలతో గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు

**(నవతరం టెక్కలి)**

శ్రీకాకుళం జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, క్రయవిక్రయాలు, రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోంది.

జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు టెక్కలి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం విజయ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై రాము నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. టెక్కలి పట్టణ పరిధిలోని అనుమానిత ప్రదేశాలు, రైల్వే



స్టేషన్, బస్టాండ్, ముఖ్య కూడళ్లు, దుకాణాలు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

అదేవిధంగా బస్ స్టేషన్‌లలో అనుమానం ఉన్న ప్రయాణికుల లగేజీ బ్యాగులను నార్కోటిక్ పోలీసు జాగిలం సహాయంతో పరిశీలించి, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు సోదాలు నిర్వహించారు.

గంజాయి అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు తెలిపారు.




# మూడు దశాబ్దాల నమ్మకానికి మరో గుర్తింపు

***పదవుల కంటే పార్టీ బాధ్యతలకే ప్రాధాన్యం ఇచ్చిన ప్రస్థానం***

***టౌన్ కార్యదర్శి నుంచి 8వ క్లస్టర్ ఇన్‌చార్జి వరకు అనేక బాధ్యతలు***

***క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతర కృషి***

***మేయర్ ఎన్నికకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడికి వినతి***

***తన ప్రతినిధిత్వాన్ని నిబంధనల మేరకు పరిశీలించాలని అభ్యర్థన***

***31 ఏళ్ల రాజకీయ అనుభవం ఇప్పుడు మరోసారి చర్చలోకి***



## 1995 నుంచి టీడీపీతో.. ఉంగటి రమణమూర్తి సుదీర్ఘ ప్రయాణం

**నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం**

రాజకీయాల్లో పదవులు రావడం ఒక ఎత్తయితే.. పదవులు ఉన్నా లేకపోయినా పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తూ నమ్మకంతో ముందుకు సాగడం మరో ఎత్తు. మూడు దశాబ్దాలకు పైగా ఒకే రాజకీయ వేదికతో ప్రయాణం సాగిస్తూ, పార్టీ అప్పగించిన వివిధ బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చిన ఉంగటి రమణమూర్తి పేరు ఇప్పుడు శ్రీకాకుళం నగర మేయర్ ఎన్నిక నేపథ్యంలో మరోసారి రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. 1995 నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న తన 31 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ.. మేయర్ ఎన్నికకు సంబంధించి తన ప్రతినిధిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడికి ఆయన వినతిపత్రం సమర్పించారు. పార్టీతో అనుబంధం కేవలం పదవుల కోసం కాదని.. బాధ్యత అప్పగించిన ప్రతిసారీ దాన్ని నిర్వర్తించడమే తన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమని ఉంగటి రమణమూర్తి పేర్కొన్నట్లు తెలిసింది.

మూడు దశాబ్దాలకు పైగా టీడీపీతో కలిసి నడుస్తూ టౌన్, డివిజన్, సెల్, క్లస్టర్ స్థాయిల్లో వివిధ బాధ్యతలను నిర్వహించిన విషయాన్ని ఆయన తన వినతిపత్రంలో వివరించారు. శ్రీకాకుళం టౌన్ టీడీపీ కార్యదర్శిగా పనిచేసిన రమణమూర్తి.. అనంతరం టౌన్ వైస్ ప్రెసిడెంట్‌గా, బీసీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. మార్కెట్ వెండింగ్ కమిటీ అడ్వైజర్‌గా, 26వ డివిజన్ ఇన్‌చార్జిగా కూడా పనిచేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం టౌన్ 8వ క్లస్టర్ ఇన్‌చార్జిగా పార్టీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

### *పదవుల వెనుక సుదీర్ఘ ప్రస్థానం*

ఒక్కసారి పదవి పొందడం కంటే.. ఏళ్ల తరబడి పార్టీతో కలిసి పనిచేస్తూ ఒక్కో బాధ్యతను స్వీకరించడం రాజకీయాల్లో ప్రత్యేకమైన అనుభవాన్ని ఇస్తుంది. ఉంగటి రమణమూర్తి రాజకీయ ప్రస్థానంలోనూ అదే కనిపిస్తుందని ఆయన తన వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలు వెల్లడిస్తున్నాయి. టౌన్ స్థాయి నుంచి డివిజన్, బీసీ సెల్, మార్కెట్ కమిటీ, క్లస్టర్ స్థాయి వరకు వివిధ బాధ్యతల్లో పనిచేయడం ద్వారా పార్టీ సంస్థాగత వ్యవహారాలపై తనకు క్షేత్రస్థాయి అవగాహన ఏర్పడిందని ఆయన వివరించారు. కార్యకర్తలతో, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామిగా కొనసాగినట్లు తెలిపారు.

### *సామాజిక రంగంలోనూ అనుబంధం*

రాజకీయ బాధ్యతలతో పాటు సామాజిక రంగంలోనూ పనిచేసిన అనుభవాన్ని ఉంగటి రమణమూర్తి తన ప్రతినిధిత్వంలో ప్రస్తావించారు. శ్రీకాకుళం జిల్లా పొలినాటి వెలమ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాజకీయ, సామాజిక రంగాల్లో తనకు ఉన్న అనుభవాన్ని సమగ్రంగా పరిశీలించి.. మేయర్ ఎన్నికకు సంబంధించి తాను సమర్పించిన ప్రతినిధిత్వంపై నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది.

### *ఇప్పుడు అందరి చూపు ఆ వినతిపైనే..*

మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఉంగటి రమణమూర్తి సమర్పించిన వినతిపత్రం ప్రాధాన్యం సంతరించుకుంది. 1995 నుంచి కొనసాగుతున్న పార్టీ అనుబంధం, వివిధ దశల్లో నిర్వహించిన బాధ్యతలు, ప్రస్తుతం చేపడుతున్న 8వ క్లస్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను ప్రస్తావిస్తూ ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడి ముందుంచారు. తన ప్రతినిధిత్వాన్ని ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరిన నేపథ్యంలో.. ఈ అంశంపై సంబంధిత అధికారుల పరిశీలన, తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మూడు దశాబ్దాలకు పైగా పార్టీతో సాగిన ప్రయాణం.. ఎన్నో బాధ్యతలు.. క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం.. ప్రస్తుతం కీలకమైన క్లస్టర్ బాధ్యత. ఈ నేపథ్యంతో ఉంగటి రమణమూర్తి సమర్పించిన వినతి ఇప్పుడు మేయర్ ఎన్నిక చర్చలో మరో అంశంగా నిలిచింది.

నవతరం
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంటి పరీక్షలు



**సంతబొమ్మాలి..** జాతీయ అంధత్వ మరియు దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సంతబొమ్మాలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 405 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ఎస్ శ్రావణి తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంటి పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలని దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ముందుగానే సరి చేయవచ్చు అన్నారు..విద్యార్థులు మొబైల్ ఫోన్లు వాడటం పరిమితం చేయాలని సరైన గాలి,వెలుతురులో చదవడం రాయడం చేయాలని సూచించారు.ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్ కే దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపంవున్న 65 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. విద్యార్థులకు *"కంటి ఆరోగ్యం-సంరక్షణ"*పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి బాబురావు ,ఆరోగ్య విస్తరణాధికారి కె శ్రీనివాసరావు, ఆరోగ్యపర్యవేక్షకులు ఎం భాగ్యవతి, ఆరోగ్య కార్యకర్త పి గణేశ్వరరావు,ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం

- *రూ.1.50 కోట్లతో బెండి గేట్--దేవనల్తాడా రహదారి పనులు*
- *గౌతు శిరీష చొరవతో పనులు ప్రారంభం*
- *పూండి, వెంకటాపురం, దేవనల్తాడా, నౌపడా ప్రజలకు ఊరట*
- *రాకపోకల ఇబ్బందులకు పరిష్కారం చూపేలా చర్యలు*
- *ప్రజా రవాణాకు ఇబ్బందులు తొలగించడమే లక్ష్యమని వెల్లడి*

నవతరం ప్రతినిధి - పలాస

పలాస నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బందులు తొలగించే దిశగా చర్యలు చేపట్టారు. వజ్రపుకొత్తూరు మండల పరిధిలోని పూండి, వెంకటాపురం, దేవనల్తాడా, నౌపడా గ్రామాలకు సంబంధించి ప్రధాన రహదారిపై రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవతో రహదారి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి.బెండి గేట్ నుంచి దేవనల్తాడా వరకు ఉన్న రహదారి మరమ్మతు పనులను రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టారు.

రహదారి దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పనులకు శ్రీకారం చుట్టారు.మరమ్మతు పనులు పూర్తయితే పూండి, వెంకటాపురం, దేవనల్తాడా, నౌపడా గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్యే గౌతు శిరీష ముందుకు సాగుతున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# స్థానిక పోరుకు సిద్ధంకండి

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపు

20న మేఘన కన్వెన్షన్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

మండల కమిటీల బలోపేతంపై ముఖ్య నాయకులతో చర్చలు

క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత చురుగ్గా తీర్చిదిద్దే దిశగా అడుగులు

నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపు



**నవతరం ప్రతినిధి - నరసన్నపేట**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని వైఎస్సార్‌సీపీ యువ నేత డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను బలోపేతం చేయడంపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మండల కమిటీలను బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత చురుగ్గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నాయకులకు సూచించారు.

### *20న నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం*

ఈ నెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నరసన్నపేటలోని మేఘన కన్వెన్షన్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు డాక్టర్ కృష్ణ చైతన్య ప్రకటించారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# కేసులతో గొంతు నొక్కలేరు

- అక్రమ కేసులకు భయపడేది లేదు
- కార్యకర్తలకు తిలక్ అండగా ఉంటారు
- స్థానిక ఎన్నికల్లో ఎదుర్కోలేకే తప్పుడు చర్యలంటూ ఆరోపణ
- తప్పు చేసిన అధికారులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించాల్సిందే
- పేరాడ తిలక్‌పై కేసులను తీవ్రంగా ఖండించిన కోటబొమ్మాళి మండల నాయకులు

**నవతరం ప్రతినిధి - కోటబొమ్మాళి**

టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌పై కేసుల నమోదు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ కేసులను ఖండిస్తూ కోటబొమ్మాళి మండల వైసీపీ నాయకులు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి తప్పుడు కేసులకు భయపడరని స్పష్టం చేశారు.కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు హేమసుందర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 15న జరిగిన టెక్కలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పేరాడ తిలక్ అధికారుల ఫోటోలను చూపిస్తూ వారి పనితీరుపై రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అనంతరం అధికార యంత్రాంగం కేసులు నమోదు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.హేమసుందర్ రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను, అధికారుల పనితీరును ప్రశ్నించే గొంతులను కేసులతో అణచివేయాలనే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి చర్యలకు భయపడరని, పార్టీ శ్రేణులకు పేరాడ తిలక్ అండగా ఉంటారని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని రాజకీయంగా ఎదుర్కొనే బదులు తప్పుడు కేసులు, ఇతర చర్యలకు పాల్పడుతున్నారంటూ నాయకులు ఆరోపించారు. తప్పు చేసిన అధికారులు భవిష్యత్తులో చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. పేరాడ తిలక్‌పై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.సమావేశంలో ఎంపీపీ రోణంకి ఉమ మల్లయ్య, జడ్పీటీసీ వెంకటరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడు నూక సత్తిరాజు, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు వినోద్ కుమార్, బీసీ విభాగం అధ్యక్షుడు పేరాడ వెంకటరావు, కోటబొమ్మాళి మాజీ సర్పంచ్ కాళ్ల సంజీవ్, జిల్లా కార్యదర్శులు బొడ్డు వెంకట్రావు, రాంపాత్రుని శివారెడ్డి, మండల విప్ బొడ్డు అప్పన్న, మండల ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు గుంట సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న కే.మాధవీలత

**ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు**

(నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం) అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని ఏపీ రైతు బజార్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారి శ్రీమతి కే. మాధవీలత శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ సాయి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కే.ఎన్.వి.డి.వి. ప్రసాద్ పాల్గొన్నారు.



# 25న బొడ్డపాడులో పైలా చంద్రమ్మ వర్ధంతి సభ




- **ఉదయం 9 గంటలకు కార్యక్రమం**
- **సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధురాలికి నివాళి**
- **న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ**
- **ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయడమే నిజమైన నివాళి**
- **విప్లవ అభిమానులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులకు పిలుపు**

*నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం*

శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధురాలు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన కామ్రేడ్ పైలా చంద్రమ్మ ఆరో వర్ధంతి సభ ఈ నెల 25న బొడ్డపాడులో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డపాడులోని అమరవీరుల స్మారక భవనం వద్ద చంద్రమ్మ ఆరో వర్ధంతి కరపత్రాన్ని ఆవిష్కరించారు. విప్లవ అభిమానులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కామ్రేడ్ పైలా చంద్రమ్మను స్మరించుకోవడం అంటే నాటి శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం అనంతరం కొనసాగిన ఉద్యమాలను, ప్రస్తుతం పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించి, వాటిపై ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయడమేనని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తెలిపారు. అదే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గొరకల బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వంకల పాపయ్య, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, ఆదివాసీ సంఘం నాయకులు సవర బంగ్లా కుమార్, మురిపింటి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడిని దర్శించుకున్న ధర్మాన రామ్ మనోహర్ నాయుడు

## నవరాత్రి మహోత్సవాల్లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యువనేత

(నవతరం, ఆమదాలవలస) ఆమదాలవలస గేటు కొత్త వీధిలోని కేవీ యూత్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు శుక్రవారం పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు యువనేతను ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో బురల్లి హరి లాల్కనీయ, బెండి గాంధీ, విభూది ప్రసాద్, విభూది మహేష్, గొద్దు దేవరాజ్, సీహెచ్ సాయి కిరణ్, మేడి దీపక్, జి. కోటి, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# త్రిబుల్ రైడింగ్‌కు బ్రేక్.. మాదకద్రవ్యాలకు నో!

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఐతం విద్యార్థులకు టెక్కలి శక్తి




(నవతరం - టెక్కలి), విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకుని చట్ట నిబంధనలను పాటించాలని టెక్కలి శక్తి బృందం సభ్యులు ఎం. గిరిధర్, ధనలక్ష్మి, ప్రభావతి సూచించారు. త్రిబుల్ రైడింగ్, మైనర్ల వాహన చోదనం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని బాలురకు అవగాహన కల్పించారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో ప్రతి నెల నిర్వహిస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా దీనిని చేపట్టారు.

ఈ సందర్భంగా శక్తి అనువర్తనం వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే విధానంపై విద్యార్థులకు వివరించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ చోదక అనుమతి పత్రం కలిగి ఉండాలని సూచించారు. ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమని, మైనర్లు వాహనాలు నడపడం నేరమని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు.

మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ సరఫరాకు విద్యార్థులు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. బాలికలను వేధించడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ బాధ్యతాయుతంగా మెలగాలని తెలిపారు. అత్యవసర పోలీసు సహాయం కోసం 112, సైబర్ మోసాలకు గురైతే 1930, జాతీయ రహదారిపై అత్యవసర సేవల కోసం 1033 నంబర్లను వినియోగించుకోవాలని వివరించారు.

కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు సహకారం అందించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి ఎస్. మారుతీ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# "సేవా "సేవా సంకల్ప్ అభియాన్" 2వ రోజు రక్తదాన శిబిరం

- సేవలలో "రక్తదాన సేవ వేరయ"..
- మహిళ మోర్చ అధ్యక్షురాలు డా. పైడి.సింధుర

**(శ్రీకాకుళం నగరం)**

సేవలలో, రక్తదాన సేవ వేరని బిజెపి మహిళ మోర్చ అధ్యక్షురాలు డా. పైడి.సింధుర అన్నారు. బిజెపి మహిళ మోర్చ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో దేశ ప్రధాని నరేంద్ర మోడి జన్మదిన వేడుకలను నెలరోజులుపాటు నిర్వహిస్తున్న విషయం విదితమే. సేవా సంకల్ప్ అభియాన్ లో భాగముగా 2వ రోజు రక్తదాన శిబిరాన్ని, స్థానిక సింధూర హాస్పిటల్ లో, ఇండియన్ రెడ్ క్రాస్ నేతృత్వంలో నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు, పి.బి.వి.కామేశ్వర రావులు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నరేంద్ర మోడీ పేరిట సేవా కార్యక్రమాలను చేస్తున్న బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్ష బృందానికి ప్రత్యేక ధన్యవాదాలని, ఈ రోజు నగరంలో రక్త కొరతను దృష్టిలో ఉంచుకొని, అలాగే తలసీమియా పిల్లల కోసం నిరంతరం ఒక యజ్ఞంలా భావిస్తున్న రెడ్ క్రాస్ కు, నేడు రక్త యూనిట్లను అందించటం హర్షణీయమన్నారు. అనంతరం డా. పైడి సింధూర మాట్లాడుతూ నెలరోజులుపాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, మోడి సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు వర్ధిల్లి దేశ సేవ, ప్రజా సేవ చేయాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ ఎస్. పద్మ కీర్తన ఇతర సభ్యుల బృందం, రెడ్ క్రాస్ పీఆర్వో జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, మేనేజర్ గొలివి.రమణ, సత్యన్నారాయణ, నంది.ఉమశంకర్ తదితరులు పాల్గొన్నారు.



నవతరం
తెలుగు దిన పత్రిక

## నవ్వుల జీవితమే నందనవనం..!

ఓసీ ప్రేయసి..!
నా ఊహల ఊర్వశి..!!
నిదురరాని నీ కళ్లలో కలలు
కనాలనే కోరిక ఇంకా చావలేదు...
నారాక కోసం ఎదురుచూసే ఆ
చూపుల్లో
మరుమల్లెలేవో ఇంకా వికసించలేదు..

గుండె గూటిలో గుచ్చుకున్న
నీ పిచ్చిఊహలు గాలివానలో
చిక్కుకున్న గువ్వల రెక్కల్లా
రెపరెపలాడుతున్నాయి...

అందమైన ఆ పెదవులపై
దరహాసం దారి తప్పింది...
లేలేత ఆ బంగారు బుగ్గలపై
జారే కన్నీటిధారలే ముత్యాల
హారాలై మెరుస్తున్నాయి...

మూతపడని నీ కనురెప్పలు
చెప్పలేని కథలను మౌనంగా
దాచుకున్న కావ్యాలయ్యాయి...

దిగులుతో తడిసిన ఆ దిండు తప్ప
దుఃఖాన్ని కప్పుకున్న ఆ దుప్పటి తప్ప
ఆరిపోని ఆ బెడ్‌లైట్ తప్ప
అర్థం కాని అంతులేని నీ ఆవేదనకు
అర్థం తెలియదు మరెవరికీ నాకు
తప్ప

ఒక కవి ఊహలకు కూడా
అందని నీ మనోవేదనకు
కాలమే వైద్యుడు...ఆశే ఔషధం...

నేటి నీ కన్నీటి చుక్కలే
రేపటి నీ చిరునవ్వుల చినుకులు...
నేటి నీ ఆశ...ఆత్మవిశ్వాసమే
రేపటి నీ తొలి ఉషోదయపు
ఉషస్సు...

ఓ సఖీ ఈ చీకటి శాశ్వతం కాదు ...
వెన్నెల వెలుగులు విరజిమ్మే
మంచి రోజులు ముందున్నాయి...
నిదురపోని నీ కళ్ళే
ప్రేమ సంతకం పెట్టకున్నాయి...

నా ఆత్మీయ అభయ హస్తాలు
నీ బుగ్గలు నిమరటానికే కాదు
కారే నీ కన్నీటి ధారలు
తుడిచేందుకు సిద్ధంగా ఉన్నాయి

లే...లే ఓసీ నా ప్రేయసి
నా ఊహల ఊర్వశి
వెచ్చని నా బిగికౌగిలిలో ...
కలలోనైనా ఒక్కసారి కరిగిపో

కారణం ఆశే స్వర్గం...
నిరాశే నిత్య నరకం...
నవ్వుల జీవితమే నందనవనం...
చివరకు చితివరకు నీ నీడగా
నీకు తోడుగా నేనుంటా...నామాట
నమ్ము..!



రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# పాతర్లపల్లి పీహెచ్‌సీలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- ప్రజల ఫిర్యాదులతో ఆసుపత్రిని పరిశీలించిన నడుకుదిటి ఈశ్వరరావు
- వైద్య సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం
- మందుల కొరతపై అసంతృప్తి
- నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే
- వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



**నవతరం - రణస్థలం**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు.ఆకస్మిక తనిఖీ సమయంలో కొంతమంది వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది తప్పనిసరిగా విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో మందుల కొరతపై కూడా ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పేద, సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు.మందుల కొరత, సిబ్బంది గైర్హాజరు తదితర సమస్యలను డీపీఎం దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్.. సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.



# అన్నదానం మహోత్తర కార్యక్రమం: డిఎస్పీ సిహెచ్.వివేకానంద

**(శ్రీకాకుళం నగరం)** అన్నదానం మహోత్తర కార్యక్రమమని, డిఎస్పీ సిహెచ్.వివేకానంద అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు, రోగుల సహాయకులకు, కలక్టరేట్ దరిలోగల బెహరా మనోవికాస కేంద్రంలో పిల్లలకు అన్నసమారాధన కార్యక్రమమును, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిదిగా పాల్గొన్న డిఎస్పీ సిహెచ్.వివేకానంద అన్నప్రసాదంను అందించి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు, రోగుల సహాయకులకు ముఖ్యంగా మనోవికాస కేంద్రంలో పిల్లలకు అన్నప్రసాదాన్ని అందించటం ఆనందంగా ఉందని, నా జన్మదినాన్ని పిల్లల మధ్య జరపటం మాటలకందని ఆనందాన్నిచ్చిందన్నారు. అలాగే జన్మదినాన అన్నసేవ భాగ్యం కల్పించిన నేటి అన్నప్రసాద దాతలు సోమేశ్వరరావు, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా.మణికంఠ రావుకు, ప్రత్యేక కృతజ్ఞతలని, అన్నసేవలో ఉన్న ఆనందం ఇంకేదీ ఉండదన్నారు. బెహరా మనోవికాస కేంద్రంలో చిన్నారులను చూస్తుంటే మనసు కరిగిపోయిందని, నిర్వాహకులు శ్యామల బృందానికి ధన్యవాదాలన్నారు. అనంతరం న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా.మణికంఠ రావు మాట్లాడుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న డిఎస్పీ సిహెచ్.వివేకానంద జన్మదినాన్ని మేము నిర్వహించి జరుపుకోవటం సంతోషంగా ఉందని, శ్రీకాకుళం ప్రశాంతంగా




ఉండడానికి ఆయన కృషి అభినందనీయమన్నారు. ఈ రోజు కార్యక్రమానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ అన్నప్రద పంపిణీ కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కె.వెంకట రమణ, లోకేష్, జిల్ ఫౌండేషన్ సత్య సాయి, అమ్మ ఫౌండేషన్ జ్యోతిర్మయి, యువ మోక్ష జిల్లా అధ్యక్ష్యులు మదన్ మోహన్, కె. శివప్రసాద్, జి.జయరాం, శ్రీను, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నషా ముఖ్త్ భారత్ యువ అభినయ కార్యక్రమం

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ప్రిన్సిపాల్ ఎన్వీ. వేణుగోపాల్

**శ్రీకాకుళం:** స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డు లోగల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నషా ముఖ్త్ భారత్ యువ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగముగా కళాశాల ప్రిన్సిపాల్ యన్వి వేణుగోపాల్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల బారినపడి తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాలు వల్ల వ్యక్తులు విచక్షణ కోల్పోయి, అనేక దురాగతాలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్య అతిథి డా. బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వనిజ, 2 టౌన్ సిఐ ఈశ్వర రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు నషా ముఖ్త్ భారత్ యువ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామనీ, యువత మాదక ద్రవ్యాలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా తెలిసో తెలియకో మాదక ద్రవ్యాలు వినియోగించినట్లయితే వారి అమూల్యమైన జీవితం కోల్పోడమే కాక చట్టరీత్యా శిక్షార్హులు అగుదరని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగం వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.




కార్యక్రమంలో కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు యల్ మోహన రావు, యస్ వి దుర్గా ప్రసాద్, విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు.

## మనో సంకల్పం !

నా శ్వాస నీతి
నా ఆయుధం నిజాయితీ
నా బ్రతుకునడకే-న్యాయం.
నా వీక్షణ ధర్మం వైపు.

ఇది నాబతుకు తీరు.
నా సహజ ధర్మం.
నీతి నిన్ను
భీతికి గురిచేస్తుంది.
శత్రువులను చేరవేస్తుంది.

నిజాయితీ నిన్ను
ఒంటరిని చేస్తుంది.
అది లేనివాడు.......
ఎప్పుడు నీకన్నా లోకువే !
న్యాయం నీ నడక సాగనివ్వదు.
దాష్టీకాన్ని ప్రసాదిస్తుంది.
ధర్మం నిను కృంగదీస్తుంది.
కాని చివరకు........
విజయాన్ని ప్రసాదిస్తుంది .

నీలో ఆత్మ విశ్వాసం
పెరగాలన్నా
నీకంటూ ఒక వ్యక్తిత్వం
సృష్టించు కోవాలన్నా
ఆచరించాలి వీటిని.
అప్పుడే నీకు........
ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.
గౌరవం నీకు.......
ఆపాదించ బడుతుంది.

ధనం. దర్పం,
నిన్నుశాసించలేవు.
ఎవరిని నువ్వు శాపించలేవు
కాని, నిన్ను గోప్యంగా
అను సరించే వాళ్ళు
వుంటారు జాగ్రత్త

నిను ఎవరు శాసించలేరు.
నీ ధనాన్ని,అందాన్ని
కాలం హరించవచ్చు
నీ సద్గుణాలను......
ఎవడు హరింపలేరు.



-సంజుటి యాదయ్య గౌడ్
హయాత్ నగర్
చరవాణి: 9849693378
హైదరాబాద్

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by SIRIGIRI VARADARAJU, on behelf of **SIRIGIRI VARADARAJU**, and printed at: Kranthi Publications, D.No.2-504/1 Aditya Nagar Colony, Arasavilli, Srikakulam, Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Published at : Kranthi Publications, D.No.2-504/1. Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor: **SIRIGIRI VARADARAJU**, Email: navararamraju@gmail.com, Cell: **9959007255, 8340844777**